# ఆదర్శ దంపతులు

* చల్లా సత్యేంద్ర శంకర్ *

" సరళా! సుందరరూపివైన, సరళాత్మురాలవైన నీకు యీ జీవితము విధి లిఖితమేనా? దరిద్రం నీబోటి అందాలమూర్తికి మెఱుగా? అందం భగవంతుని సృష్టిలో ప్రథమస్థానాన్నలంకరించుతుంది. ఆ ఉన్నతి దారిద్ర్యాని కంకితమగుటాశ్చర్యముగాదా?"

" కాదు! సతీష్! కాదు! దరిద్రం జీవితాన్నికించపరుస్తుంది. కాని ఆత్మ తన సుస్వరూపాన్నిఅందులోనే తిలకించుతుంది. దరిద్రంలోనే ఆత్మ వికసిస్తుంది. పుష్పము నెంత అందమైన గ్లాసులో నుంచిననూ తన కొమ్మనున్నప్పటి సౌందర్యాన్ని పొందలేదు. పక్షి బంగారు పంజరములో స్వేచ్ఛ కనలేదు."

" అనంతమైన భాగ్యాల్లో, భౌతిక సుఖాల్లో ఆత్మ మరచిపోబడుతుంది. ఆత్మ వికాశంలేని భాగ్యాలు దరిద్రంకన్న అసహ్యాం, అన్నా!"

" చెల్లీ! నీ వనుభవించుటయేగాక దారిద్ర్యాన్ని ఆదర్శప్రాయమైనదిగా, ఆధ్యాత్మిక పరిజ్ఞానానికి అనుకూలమైనదిగా ఆదేశించుట ఆశ్చర్యజనకంగదూ!

" అవును! నీవేంచేస్తావు మూగగా అనుభవిస్తావు. అజ్ఞానంతో ఆనందించెదవు. అంతియే కాని దాని నిర్మూలనానికి నీవుగాని నీ పతిగాని పూనుకొనరుకదా! తండ్రి తన బుద్ధి మాంద్య స్థితిలో నిన్నర్పించాడు ఒక చేతకాని వాజమ్మకు. అతనేదో ఆనంద ప్రాప్తికి దీవిగానెంచి నీవేమో ఆనందించుతూ వచ్చావు. అంతేగా నీవుచేసినది. జోగి జోగి రాసుకొంటే బూది రాలిందనే మోట సామ్యంలాగుంది మీ యిరువురి జీవన యాత్ర.

" ఎంత వైభవంలోంచి ఎంత నీచంలోకి, ఎన్ని సౌఖ్యాల్లోంచి ఎన్ని కష్టాల్లోకి కూలబడ్డావు! నీకేమీ విచారంలేదు. కాని, సరళా! నాకు ఎంత చిన్నతనంగా వున్నదో నీకేం తెలియదు ఎవరితో మాటాడినా ఎవరితో తిరుగుచున్నా, 'అదేమిటోయ్ నీబావ అలా పేదరికంలో బికారిలా తిరుగుతూవుంటే వూరుకొన్నావు.' అంటున్నారు.

" ఎంతసిగ్గు! తండ్రిచేసిన అపచారానికి నీవు బలి అగుటయేగాక నాకెందుకీ యపకీర్తి? చెల్లీ! ఇప్పటికైనా నీవు తెలివితెచ్చుకో. అతని పిచ్చి ఆదేశాలకు అదుపుపెట్టి, ఆ వెఱ్ఱి మొఱ్ఱి తిరుగుళ్లకి స్వస్తిచెప్పి తను యిదినరలో వదిలిపెట్టిన వుద్యోగాన్ని తిరిగి చేస్తూ సుఖాన్నుండమను.

" ఎన్నో సుఖాలు! ఎన్నో గౌరవాలు! జీవితాన్నలా జీవించుటకేగాని ఇలా దీనంగా వెళ్లబుచ్చుటకు గాదు. అతనికా చదువుంది. విజ్ఞానవంతుడు. అతనికేం లోటు? నాదా అఖండైశ్వర్యం. అచ్చటకొచ్చి వుండండి. మీకెట్టిలోటు లేకుండా చూచే పూచీనాది."

" సతీష్! నీవు చెప్పేడి దబద్ధంకాదు. అగౌరవమయినదిగాదు. కాని, అన్నా! ఒకరిపై

నా ధారపడిన బ్రతుకుకన్న అనంత దరిద్రంలో వస్తు పడుకొను టుచితము. ఇంతమాత్ర మెరుగమూ మేము? అన్నీ ఎరుగుదుము. కాని నీ వనుకొనెడి జీవితాన్ని, మేమాశించే జీవితానికి మధ్య అఖాతాలున్నాయి అడ్డం. ఐశ్వర్యంలోనే లేదు గౌరవం. తనకున్నదానితో తృప్తిపొంది సుఖించి యితరుల మేలుకై పాటుపడుటకన్న ఉచితమయినది, గౌరవనీయమైనది, మానుష మయినది, పూజ్యమయినది, దైవికమయినది వేరొకటి లేదు."

"సరళా! నీవాశించెడిది ఎండమావు మాత్రమే. నీవున్నది త్రిశంకస్వర్గమే. నీ వనుభవించేది తుచ్ఛ దారిద్ర్యమే. నీవు బ్రతికినదానికి, బ్రదుకుతున్నదానికి, బ్రదుకపోయెడిదానికి వ్యత్యాస మెరుగని అజ్ఞానివని, అమాయికవని నేతలపలేదు.

"నీ అందానికి, నీ సౌకుమార్యానికి, నీ విద్యాసాంస్కృతికి నీవొకవున్నత కుటుంబానికి గృహలక్ష్మివయ్యేదవనుకొంటిని గాని యిలా దుర్భర దారిద్ర్యానికి ఆహుతయి యిందులోనే సుఖముందనే మూర్ఖ మహిళవనుకొనలేదు. ఇదుగో! ఆఖరుసారిగా చెప్తున్నా విను. నీకింత వరకు చెప్పిన సంగతుల నీ భర్తతో ఆలోచించి ఒక నిశ్చయానికొచ్చి వుండకపోతే యిదే నా తుదిరాక."

అని సతీష్ తన చెల్లి యింటినుంచి తన యింటికి విసురుగా వెళ్లుతున్నతరి తన బావగారైన రమేష్ త్రోవలో ఎదురుపడ్డా చూచి చూడనట్లుగా వెళ్ళిపోయాడు. రమేష్ కూడ ముభావంగానే యింటికి తిరిగివచ్చాడు. ఇంటికి వచ్చీ రావటంతోనే సరళ గదిలోకి వెళ్లాడు. సరళను చూచీ చూడటంతోనే ఆమె ప్రశాంత వదనం ముకుళించుకొని హృదయం కంపించుచున్నట్లు తెలుసుకొని, దీనికి సతీషే కారణమయి వుండాలని అనుకొన్నాడు రమేష్. సరళను జేరి ఆమె తల నిమురుచు గంభీరముగా, 'సరళా! నీ మందస్మిత ముఖాకాశమును కాళమేఘాలు మరుగుపరుస్తున్నట్లు, నీ నిర్మల హృత్సరస్సులో విషబిందువులు కలపబడినట్లు నీవు కంపిత మనస్కవైయుండ గతంబేమి?' అని ప్రశ్నించెను. అంత సరళ తనకు తన అన్నకు జరిగిన సంభాషణంతయు తన ఆదర్శజీవికి విన్నవించుకొంది.

రమేష్ నిశ్చల గంభీర హృదయానికి దొకగడ్డు సమస్యగాదు. పరీక్ష ఎంత మాత్రమూ గాదు. అతని గత జీవిత పురాణంలో యిల్లాంటివెన్నో పుటలు వ్రాయబడ్డాయి. ఇంతకన్న మిక్కుటమైన సమస్యలు పరిష్కరింపబడ్డాయి. అతని జీవితయానం యే గమ్యస్థానం వద్ద ఆపబడాలో అతనెరుగు.

జీవితాన్ని రమేష్ రెండుగా విభజించాడు. జ్ఞానం, అజ్ఞానం. ఈ రెంటినీ మానవుడు తీవ్రంగా తీసుకొనవలసిన ముఖ్య విషయాలు. మానవుడు పిల్లప్పుడూ పూర్ణజ్ఞాని అనిగాని, పూర్తి అజ్ఞాని అనిగాని అతను నమ్మడు. ఈ రెంటిలో ఏ ఒకటైన తన పూర్ణత్వాన్ని పొందినట్లైన మానవ జాత్యభ్యుదయ మేనాడో అరికట్టబడి వుండేది. మానవుడు తన జీవితాన్ని అజ్ఞానంలోంచి జ్ఞానంలోకి, చీకటినుంచి వెలుతురులోకి, అనిత్యం

లోంచి నిత్యంలోకి, మృత్యువునుంచి జీవితం లోకి యానించుటే ఒక మహోన్నత గాథ. ఈ సాధనం ఫలించిన మానవుడు తన జీవిత పంథాను జ్యోతిర్మయం చేయగలడు. ఈ వేదాంతాకారమే రమేష్.

సరళ చెప్పిన విషయాల్ని సావధానచిత్తుడై రమేష్ ఆలోచించెను. ఆ ఆలోచనా ఫలితం అది వట్టి బుద్బుదప్రాయమని తేల్చుకోవడం. ఆ విషయం సరళతో మొదట్లోనే చెప్పడం రమేష్ కిష్టమువలేదు. కారణం సరళ స్త్రీ. స్త్రీ సామాన్యంగా చంచల అని మనపూర్వులు నుడివారు. అయినా సరళ విషయంలో ఇది అసంబద్ధమని రమేష్ ఎరుగు. కాని ఆమె మనస్సు ఏస్థితిలోనున్నదో,—అనుకూలమో, ప్రతికూలమో—తెలుసుకొనకుండ తన నిశ్చయాన్ని తెలిపి ఆమెను కలవరపెట్ట తలవలేదు.

సరళ యీలోగా సంగతులను సంగ్రహంగా సింహావలోకనం చేస్తూంది. ఆమెలో కలతపోయి కమనీయత చంచలతపోయి, అచంచలత తమ తమ స్థానాలను తిరిగి చేరుకోవటం ఆమె ముఖంలో గమనింపబడ్డది. సరళ చంచల స్వభావి ఎప్పుడూ కాదు ఆమెకు తననిశ్చయం, తన గమ్యస్థానం కరతలామలకం. పూర్తిగా తన భర్తే దైవమని అతడేది చెప్పిన అయ్యది వేద వాక్యని మూఢంగా తలనూపే ఛాందస 'పతివ్రత 'గాదు. ఆమె యెఱుగు—తను ఒక 'వ్యక్తి' నని, వ్యక్తిగతంగా సంఘంలో తనకుకూడ పాత్రానిర్వహణ వున్నదని, తన హక్కుల తా నెరుగు. పాత్రా పాత్ర, ఉచితా నుచిత విమర్శనా దృష్టి ఆమెలో వుంది. కాన సరళ అజ్ఞాని గాదు.

సంఘ బాధ్యతల నెరుగు. భర్త మాట యందు భక్తిగలది. (ఇది అమిత మూర్ఖంలో లేనంతకాలం తన, తన భర్తలయొక్క జీవితాలు ఆదర్శములే! ఒకసారి యీ 'భక్తి' అనే రెండు అక్షరముల పవిత్ర కూర్పుగట్టుతెగి మూఢంగా వుపయోగింపబడ్డ అది అజ్ఞానానికెంతో దూరాన వుండదు.) ఈ సహజ పరిజ్ఞానం సరళ ప్రతి నాళంలోను జీర్ణించియుండుటచే ఆమె తన 'పతి భక్తి' అనే మాటకు దైవత్వాన్నొసగెను.

విద్యా సంస్కృతి సరళను సాంఘికంగా ఎంత ఉన్నత సోపానంపైనుంచినను మానసికంగా 'భారతనారి' మాత్రమే. ప్రతి పని, అందులోనూ భవితవ్యానికి సంబంధించిన ఏ పనిని తాను సాహసంతో తానై నిర్ణయించ లేదు. కారణం ఆమె ఒక పురుషుని యిల్లాలు. తర తరాలుగా వచ్చే సాంప్రదాయానికి సరళ కూడ అనుగతవతియే! ఆమె భూత, వర్తమాన కాలానికి పైగా పెఱుగలేకపోయింది. ఆమె పూర్వాచారాల విషయమై అంత తీవ్రంగా ఆలోచించనూ లేదు. అందుచేత తన యావజ్జీవితాన్ని తన భర్త కెప్పుడో (అతడు తన ఆదర్శజీవి అని గ్రహించినపుడే) అంకిత మిచ్చింది. ఇప్పుడూ ఆమె అతని అనుగతవతియే. సరళ మౌనంగా తన పతి కళ్లల్లోకి చూచింది.

అప్పుడే రమేష్ గ్రహించాడు. సరళ తన నిశ్చయానికే ప్రాధాన్యత నిచ్చునని. అప్పుడు

**రమేష్** తన గంభీర స్వరంలో ఇలా చెప్పాడు: సరళా! ఈ పేదరికం మనపై త్రోయబడినప్పుడు దుర్భరం గాని మనం అంగీకరించినపుడు అలా గాదు. నారాయణుడు దరిద్రులలో నేగదా సదా నివసించును. అదిగాక సాటి మానవు లనేకులు అజ్ఞానంలో, పేదరికంలో క్రుళ్లుతూన్నప్పుడు నీ ఐశ్వర్యముల సార్థకత ఏమిటి? గుండెలో పుండును మరచి శారీరక సొగసులకై పాటు పడుటలో అర్థమేమిటి? మురికి గుంటలమధ్య పూరికొంపకు నీ 'రే రాణి' మధుర వాసనలు, నీ పంచపక్ష పరమాన్నముల ఘుమఘుమలు ఏం సౌఖ్యం? ఏం తృప్తి? ఐశ్వర్యవంతులు తాము చేయు ప్రతి దుబారాకు తామర్థ మెరుగరు కాని నా దరిద్ర సోదరుని రక్తపుచిఠాలో ఎల్లపుడూ ఖర్చు రాయబడుతూనే యుంది. దిన దిన క్షయమయే ఆ బీదవాని శరీరంపై భాగ్యవంతుని ప్రతి అనాచారము ప్రత్యక్షమే. ఇది సర్వాంతర్యామి అయిన సర్వేశ్వరుడవలోకించుచునే యుండెను. అందుచే ఆ భగవంతుని దయామయి దృక్కుల రెక్కల మాటున మనం మన సోదరులతో సహారక్షణ పొందుదాం. మన పరమార్థాన్ని సాధించుదాం.

★

బిడ్డల లివరు అండు స్లీప్లను వ్యాధులకు

పాత్రుడుగారి **బాలసంజీవిని**

డాక్టరు పిళ్లా పాపయ్యపాత్రుడుగారి "బాలసంజీవిని" నిజముగ అమోఘమైనది. బిడ్డలకు సంభవించు లివరు అండు స్లీప్లను వ్యాధులలో ప్రథమ దశయందుగాని, కాంప్లికేటెడ్ స్థితియందుగాని తప్పకుండ గుణమిచ్చును. నా వైద్యవృత్తియందును నా స్నేహితులలోను, బంధుకోటిలోను అనేకులు ఉపయోగించుటవల్లను "బాలసంజీవిని" యొక్క గుణాతిశయములు పరీక్షించుట కవకాశమేర్పడినది. బజారులోగల యితర లివరు ఔషధములుగూడ యిదివరలో వాడి చూచితినిగాని "బాలసంజీవిని" వాడిన పిమ్మట పైవాటినెల్ల విసర్జించి దీనినే హెచ్చుగ వాడుచున్నాను. అమోఘముగ నిట్టి మహదౌషధమును ప్రజోపయోగమునకు వినియోగించుచున్నందుకు పిళ్లావారి వంశము స్తుతిపాత్రమైనది.

డాక్టర్ ఎన్. రామనాథన్‌గారు, L. M. P. కావేరిపాకం.

వివరములకు:

డాక్టరు పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదర్సు,

నెం. 11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మద్రాసు 4.

| కుంభకోణం బ్రాంచి: | తిరుచినాపల్లి బ్రాంచి: |
| --- | --- |
| నెం 7, సారంగపాణి కోవిల్, | నెం 15, ఫుగళై పిళ్లై వీధి, |
| తూర్పువీధి. | తెప్పకొలం. |

అన్ని మందుల షాపులలోను దొరకును.